
# ఎత్తుపల్లాలు

'విహారి'



వరమ్మ గారిది లంకంత కొంప. ముందు టెన్నిస్ కోర్టంత మేరలో వాకిలి. దాన్లో రకరకాల మొక్కలు. తూర్పు ప్రహరీగోడ వారగా పొగడచెట్లు. దాని కింద రాతి అరుగు.

వెనకాల ఫుట్‌బాల్ కోర్టంత పెరడు. రాచ ఉసిరి, జామ, పెద్దఉసిరి, బాదం చెట్లు. మూలగా కొబ్బరి చెట్లు. బావి గట్టున అరటి.

పడమర సరిహద్దు పొడవునా ఒక చింత, ఒక ఉత్తరేణి. వాటి పక్కగా చిటికేసరపు చెట్లు ఉండేవి.

దక్షిణాన మూడు గదుల ఔట్‌హౌస్ - రేకులది. ఫీటికి కొంచెం ఆవలగా ఖాశిం గుడిసె.

భవంతి జమీందారుల వేసవి విడిదిలా అనిపించేది. రాజద్వారంలో నుంచీ, హాల్లోని చెక్క ఉయ్యాల కనిపిస్తూ ఉండేది.

వరమ్మ భర్త ఆమె చిన్నతనంలోనే కాలం చేశాడు. ఆమెకు ఒక్కతే కూతురు - సరోజ. విదేశాల్లో ఉండే ఇంజనీరు కిచ్చి సరోజకి రంగరంగ వైభవంగా పెళ్లి చేసింది వరమ్మ. ఆరేళ్ల కాపురంలో ఒక కొడుకునీ, ఒక కూతుర్నీ ఇచ్చి విదేశాల్లోనే విమాన ప్రమాదంలో పోయాడు సరోజ భర్త. అత్తవారింట్లో ఆస్తి పంపకం చేసుకుని అమ్మదగ్గరికే చేరింది సరోజ. పెద్దవాడు రఘు. రెండోది సంపూర్ణ.

వరమ్మగారికీ, నాకూ బంధుత్వం ఉంది. అయితే అది ఎక్కడో కొడితే ఎక్కడో రాలిన సామెత. బంధుత్వం కంటే తన ఆస్తి వివరాలకూ, కూతురు అయివేజు వ్యవహారాలకూ లెక్కా పత్రం జాగ్రత్త చేసేందుకే తమ ఔట్‌హౌస్‌లో నాకు ఆశ్రయమిచ్చింది వరమ్మగారు.

మా ఆవిడ పట్ల వరమ్మ గారికి ప్రేమ, అభిమానం అనీ అంటూ ఉంటారు. మమ్మల్ని తెలిసినవాళ్లు. ఇంటి పురోహితుడి కూతురుగా - శారద - పుట్టినప్పటినుంచీ తెలును వరమ్మగారికి.

ఇంక ఖాశిం విషయాని కొస్తే, అతను తోటమాలీ, కూలీ, పనిపాటలకు చేతి కింద మనిషి.

ఖాశిం భార్య ఖాజాబాయ్ ఆ ఇంట్లో పనిమనిషి. ఖాశింకి నలుగురు సంతానం. పెద్దవాడు నత్తార్. ఆ తర్వాత ముగ్గురూ ఆడపిల్లలు. రాణి, రజని, శంకర్ - మా పిల్లలు.

ఖాజాబాయ్, శారద వరమ్మగారికి రెండు కళ్లు. పండక్కీ, పబ్బానికీ చెప్పేదేముంది గానీ, రోజూ కూడా వీళ్లిద్దరే ఒళ్లు విరుచుకునేవారు.



శంభో శంకర

చిత్రం: అప్పాజీ, తెనాలి.

వరమ్మ మాట తీరే వేరు. ఉతికి ఆరేసిన నేత చీరను తెల్లవారుజామున కప్పుకున్నట్టు ఉంటుంది - ఆమె మాటలు వింటుంటే!

"స్నానం చేసే వచ్చావుటే! రాత్రల్లా మొగుడి వక్కలో పడుకుని, ఉదయాన్నే లేచి అట్టాగే రాబోకు. కాస్త మడీ దడీ ఉన్న ఇల్లు. అందులోనూ పూజ గది వక్కగా పాటికి పదిసార్లు తిరుగుతూనే ఉంటావ్!" అనేది వరమ్మగారు.

"పోండమ్మా మీరు మరీనూ! నలుగురి పిల్లల తల్లిని. నిన్నో మొన్నో పాదీ అయిన పిల్లనా?" అంటూ ముసిముసి నవ్వులు నవ్వేది ఖాజాబాయ్.

సందె చీకటి. పిల్లలు ఆడుకుంటున్నారు.

పొగడ చెట్టు కింద రాతి అరుగు మీద కూర్చుని ఉంది వరమ్మగారు.

ఖాజాబాయ్ వక్కగా వెళ్తోంది. పిలిచింది - "గోరింటాకు నూరి పెట్టాను. తీసుకుపో! పిల్లలకు పెట్టి, నువ్వూ పెట్టుకో! రేపు అట్ల తద్ది. రాత్రికి పొట్లకాయ కూర చేసి, పెరుగన్నం కలపమని చెప్పాను శారదకి. ఉయ్యాల కట్టమని చెప్పు మీ ఆయనకి!"

లేత వెన్నెట్లో కమ్మ తెమ్మెర వీస్తున్నట్టుండేది.

హాలు మధ్యగా కూర్చుని గచ్చు మీద కందిపప్పు పోసుకుని బాగుచేస్తున్నారు శారదా, ఖాజాబాయ్.

ఉయ్యాల బల్ల మీద కూర్చుని భాగవతం చూస్తోంది వరమ్మ. యధాలాపంగా అంది - "ఈ పనులన్నీ ఎప్పుడూ ఉండేవే గానీ, శారదా! రేపు రథసప్తమి. కాసిన్ని జిల్లేడు ఆకులు కోయించు. పొంగలికి పాల సంగతి చూడు. పెందరాళే స్నానాలు కానీయండి! అందరికీ భోజనాలు ఇక్కడే అని చెప్పు. మీ ఆయనకి నే చెప్పాన్లే. ఇంకా కొన్ని చిన్న చిన్న పనులున్నాయి, వాటిని తను చూసుకుంటాడులే!" అని వక్కకు తిరిగి, "నువ్ ఖాశింకీ చెప్పు!" అన్నది ఖాజాబాయ్ నుద్దేశించి.

"అదేంటి, పిన్నీ! రథసప్తమి కూడా భోజనాలెందుకూ? పూజ చేసి పొంగలి తీసుకుంటాములే!" సందేహంగా అన్నది శారద.

"నాకు తెలుసులేవే అవన్నీ! నే చెప్పినట్లు చెయ్! ఒక్క రోజు భోజనాలకి పుట్టేమీ మునిగిపోదులే. నువ్వొక్కత్తవే తొక్కిసలాట లోడకు. సరోజ కూడా చూస్తుందిలే వంట పని!"

వరండాలో పుస్తకాల బీరువా సర్దుతున్న నేను నన్నగా నవ్వుకున్నాను.

మర్నాడు రాత్రికి అర్థమైంది మాకు - ఆవేళ వరమ్మ భర్తగారి తిథి అని. వేరే ఏ ఆర్భాటమూ ఉండేది కాదు. అన్ని జ్ఞాపకాల ఆరాటమూ ఆకుచాటు పిందెలా లోమదిలో ఉంచుకునేది వరమ్మగారు.

మే నెల చివరి వారం జరుగుతోంది.

ఆ వేళ -

బావి గట్టున నీ రెండ పడుతోంది. నూతి పళ్లెం అంచున మినపప్పు కడుగుతోంది శారద. నేను బాదం చెట్టు ఆకులు కోస్తున్నాను. వరమ్మగారు దొడ్డి గడప మెట్టు మీద కూర్చుని, కొబ్బరి ఈనెల్ని సరిచేస్తోంది.

"శారదా! పిల్లలు కాశీ మజిలీ కథలు కావాలని గొడవ పెడుతున్నారు. వాళ్లను నా దగ్గర పడుకోనీ! సెలవులేగా! సరోజా, నేనూ వాళ్లకి కథలు చెప్తాం" అంది వరమ్మగారు.

"అట్టాగేలే, పిన్నీ!" అంటూ చేయి కడుక్కొని లేచింది శారద.

చీకటి పడింది. ఖాశిం చేత చిన్న బుట్టెడు మల్లెమాలలు పంపింది. ఆ తర్వాత కాసేపటికి పాల గిన్నెతో వచ్చింది ఖాజాబాయ్. నేను ఏదో పత్రిక తిరగేస్తున్నాను. "అమ్మ పంపించింది!" అంటూ పాల గిన్నెని అక్కడే ఉంచి వెళ్లింది ఖాజాబాయ్.

శారద తనలో తాను నవ్వుకుంది. "ఏయ్, పిల్లలూ! అన్నాలకి రండర్రా!" అని పిల్లల్ని పిలుస్తూ, నా వంక క్రీగంట చూసింది శారద. నాకేమీ అర్థం కాలేదు.

అందమైన ఆ రాత్రి - అటు తర్వాత చెప్పిన కథలూ, విప్పిన జ్ఞాపకాల దొంతరలూ - వరమ్మగారి మనసులా - చల్లగా, ఆర్ద్రంగా, ఆహ్లాదంగా, ఆనందంగా నన్నూ శారదనూ ఏవో దివ్య లోకాల్లో తేలియాడజేసినాయి.

తెల్లని వెన్నెల పూర్తిగా మా కోసం ఒలికినట్లైంది. అ దో మనోజ్ఞమైన అనుభవంగా మిగిలింది. ఆ అర్ధరాత్రికి ఏదో అర్థం చేకూరినట్లైంది.

మర్నాడు చెప్పింది శారద - "పిచ్చిపిల్ల! నిన్న నీ పెళ్లి రోజు" అని ఆప్యాయంగా భుజం తట్టిందిట వరమ్మగారు.

వాత్సల్యం జీవితంలా ప్రవహించడం అంటే ఇదేనేమో ననిపించింది నాకూ, శారదకూ.

సంక్రాంతి ముందు -

వడ్ల బస్తాలతో దిగేవాళ్లు రైతులు.

అ దో పెద్ద కోలాహలం.

ఆరు ఎడ్లబండ్లు, పది పన్నెండుమంది వచ్చేవాళ్లు వాటితో.

రోడ్డు వారగా ప్రహరీ గోడను ఆనుకుని చెట్లకింద ఎడ్లకి విశ్రాంతి.

గాదెలో ధాన్యం నింపి, ఊరంత తిరిగి సరకులూ, తినుబండారాలూ, వెచ్చాలూ - అవీ ఇవీ కొనుక్కుని వచ్చేవాళ్లు రైతులు.

ఏ నాలుగో రోజునో, అయిదో రోజునో పల్లెకు తిరిగి వెళ్లడం.

"అరేయ్ పుల్లాయ్! మీ అందర్కీ ఎప్పు డేం కావాలో అప్పుడు తినండి. మొహమాటం లేకుండా ఆ శారదను అడిగి పెట్టించుకోండి. మంచి సెబ్బరలు దాచుకోమాకండి. ఊరి విశేషాలూ, కళ్లం కబుర్లూ ఆ రామ్మూర్తితో మాట్లాడండి. ఏటి కేడాదీ ఒళ్లు పుండు సేసుకునేదే మీ పని. హాయిగా విశ్రాంతిగా నిద్రపోండి రాత్రిళ్లు. సినిమాలనీ, షికార్లనీ తిరగమాకండి!" - ఇలా ఉండేవి ఆమె మాటలు.

వాళ్లంతా పల్లెకి తిర్గి వెళ్లే నాటికి అందరికీ కొత్త బట్టలు తెప్పించేది. వాళ్ల భార్యా పిల్లలకీ

అందేవి అవి. ఆడపిల్లలున్న వాళ్ల కోసం గాజులూ, పూసలూ, రిబ్బన్లూ కొనిపించేది ప్రత్యేకంగా.

వాళ్లందరూ తిరిగి వెళ్లిన తర్వాత ఓ రోజు అడిగేది నన్ను - "ఎట్టా ఉంది ఈ ఏడాది ఫలసాయం" అని.

నేను ఎవరెవరు ఎంతెంత బకాయి పెట్టారో చెప్పేవాణ్ణి. అంతా విని, "కానీ, పాపం గింజ రాలందే వాళ్లయినా ఏం చేస్తారు" అని, "బాకీలూ, గీకీలూ అని వాళ్ల నెత్తిన కూర్చోకు. మన కేం అంత నరిపోని పరిస్థితి కాదుగా!" అనేది.

ఆమె మనను నాకు తెలును. పదేళ్ల నుంచీ పాత బకాయిల్లో వసూలైన వద్దు ఏముంది కనుక? నేను మౌనంగా ఉండేవాణ్ణి.

ఆషాఢం వెళ్తోంది.

ఉదయాన్నే వచ్చాడు రాజయ్య. వస్తూ వస్తూ వాననీ వెంటబెట్టుకు వచ్చాడు.

పల్లె విషయాలూ, పరామర్శలూ అయినాయి. మెరక చేను చూసేది అతనే.

గ్లాసులో కాఫీ పూర్తి చేసి, గుండెల్నిండా భయం నింపుకున్నాడు రాజయ్య.

బెరుకు బెరుగ్గా చెప్పాడు - "పెద్దమ్మాయి పెళ్లి చేయాలని ..." నసిగాడు.

వరమ్మగారు తక్కున అన్నది - "శుభం! కానీ!" క్షణాల తర్వాత అడిగింది - "పిల్లవా డెవర్రా?" అని.

"పుల్లయ్య కొడుకే నమ్మా! ఏదో తెలిసిన నమ్మంధం. మంచోళ్లు. ఆ కుర్రాడు ఈడనే ఏదో ఆఫీసులో జవానుద్యోగం. సేస్తా వున్నాడు" చెప్పాడు రాజయ్య.

"బాగుంది, ముహూర్తం పెట్టుకున్నారా!"

"ఇంకా లేదమ్మా! మీతో వో మాట చెప్పి, దిగుదామని ..."

"నాతో చెప్పేందు కేముంది, రాజయ్యా! అట్టాగే కానీ!" అంది.

నే నేదో చెప్పబోయాను. నందేహంగా ఆమె కేసి చూశాను.

"నాకు తెలుసులే రామ్మూర్తీ, మన పాత బాకీలూ, కొత్త కష్టాలూ - ఎప్పుడూ ఉండేవే! వాటి కోసం వయసొచ్చిన పిల్లల్ని ఎండగట్టామా! నువ్ కానీయ్, రాజయ్యా!" అన్నది.

చీకటి గుండెలతో వచ్చి, వెలుతురు కళ్లతో తిరిగి వెళ్లాడు రాజయ్య. వాన కూడా ఆసరికి వెలిసింది.

ఆ మధ్యాహ్నం నాతో చెప్పింది వరమ్మగారు - "ఓ పది బస్తాలు ధాన్యం మిల్లు కేసి ఆ డబ్బును రాజయ్యకు పంపు!" అని.

నేను ఆశ్చర్యపోయి, దిక్కులు చూస్తూంటే, పక్కనే ఉన్న అమ్మకు వంత పలికింది - "అవును, వాళ్ల మంచీ చెడూ చూడాల్సింది కూడా మనమే కదా! ఆ బాధ్యత కాదంటే ఎట్టా?"

నాకు నగం అర్థమై, నగం కానట్టుగా ఉంది.

నా పరిస్థితిని పసిగట్టి నన్నగా నవ్వుకుంటోంది ఏదో పనిలో ఉన్న శారద.

మధ్యాహ్నం ఒంటిగంట దాటుతోంది.

హాల్లో పచ్చీసు జరుగుతోంది. పందేలూ, పై పందాలూ సాగుతున్నాయి. వరమ్మగారూ, సరోజ, శారద, ఖాజాబాయ్ - ముగ్గులో ఉన్న మనుమలు.

వీళ్లకి పక్కగా పిల్లలు చేరి గచ్చకాయలూ, పులీ జూదం సాగిస్తున్నారు. ఇటు వీళ్ల అరుపులూ, అటు వాళ్ల అరుపులూ!

ఇల్లంతా పెళ్లి పందిరిలా ఉంది.

గచ్చకాయలు ఆడుతున్న మా రాణీ, రజనీ, ఖాశి కూతుళ్లు ఫాతిమా, ముంతాజ్ - గవ్వలాట పక్కగానే ఉన్నారు. దాంతో వీళ్ల అరుపులూ, వాళ్ల మాటలూ - కలగాపులగంగా కలిసి ధ్వనినీ, ప్రతిధ్వనినీ సృష్టిస్తున్నాయి.

ఆ హాల్లోనే ఓ మూలగా కూర్చుని సత్తార్‌కి లెక్కలు చెప్తున్నా న్నేను.

"ఇవ్వాళ మీ అమ్మ పెరుగన్నం భలే చేసిందే, ముంతాజ్! అబ్బ! ఎంత బాగుందో? నాకైతే ఆ గిన్నెలో ఉన్న అన్నమంతా నేనే తినేయా లనిపించింది" - రాణి అంటోంది.

ప్రతిగా ముంతాజ్ అంది - "మా చెయ్యి బహూత్ పసంద్!"

ఆడవాళ్లు ఈ మాటలు విన్నారు.

శారద ఉలిక్కిపడ్డట్లు గమనించాను. రాణి వైపు అదోలా చూసింది. గోడ నున్న వస్తువుని వెదుకుతున్నట్లు ఆమె విశాల నేత్రాలు నాకేసి కొన్ని దృక్‌బాణాల్ని వదిలినాయి.

వరమ్మగారు అన్నది - "అయితే ఈ పిల్లలు మీ ఇంట్లో అన్నీ తింటున్నారుటే!" ప్రశ్న రానే వచ్చింది.

శారద భయపడింది నిజానికి ఈ ప్రశ్న వస్తుందనే. కొద్దిసేపు కళవళపడి, క్షణాల తర్వాత చెప్పింది - "ఎప్పుడైనా. పెరుగన్నమో, సేమ్యా పాయసమో అయితే ..."

"అవును, అంతే, అంతే!" వంత పలికింది ఖాజాబాయ్.

"అయితే, అంత బాగా చేస్తావా?" యధాలాపంగా అంటున్నట్లు అని పందెం వేసి పావు కదిపింది వరమ్మగారు.

ఏదో కష్టాన్ని గట్టెక్కిన దానిలా నిట్టూర్చింది శారద.

ఆ రాత్రి

ఖాజాబాయ్ సేమ్యా పాయసాన్ని రుచి చూసింది వరమ్మగారు! హాల్లో గులేబుకి వేళ్లాడుతున్న పిచ్చుక కిచకిచ మంది!

** ** **

ఇరవై ఏళ్ల క్రితం జరిగిన సంగతులూ, సంభవాలూ - ఇవన్నీ స్మృతుల పేటిక తెరిస్తే మాసినవీ, మెరిసేవీ - అన్ని వస్తువులూ బయటకు తొంగి చూశాయి మరి!

ఇప్పుడు -

వరమ్మగారి లోవాకిట్లో షాపులు వెలిసినాయి. ఒక షాపులో నేను ఫోటో స్టూడియో పెట్టుకున్నాను. దాని మీద రాబడి కంటే ఓ వీడియో కేసెట్ల అద్దె అంతో ఇంతో కూడు బెడుతున్నదంటే అతిశయోక్తి కాదు.

ఖాశిం నా షాపు పక్కగా సైకిల్, స్కూటర్ మెకానిక్ అయిపోయాడు.

## సంగతులు - సందర్భాలు

### మనమే మన శత్రువులం!

**సేకరణ : మన్నవ గిరిధరరావు**

పాకిస్తాన్‌తో సహా భారత దేశ విస్తీర్ణం 15 లక్షల చదరపుమైళ్లు. 1951 జనాభా లెక్కల ప్రకారం ఈ రెండు దేశాల జన సంఖ్య 43 కోట్లు.

బ్రిటన్ దేశపు విస్తీర్ణం 94 వేల చదరపుమైళ్లు. 1951లో ఆ దేశపు జనాభా 5 కోట్లు.

భారతదేశపు విస్తీర్ణంలో 16వ వంతు, జనాభాలో 8వ వంతు మాత్రమే ఉన్న ఇంగ్లండు ఈ దేశాన్ని ఎలా జయించగలిగింది? రమారమి 8,000 మైళ్ల దూరంలో ఉండి కూడా ఇంత పెద్ద దేశాన్ని ఎలా పాదాక్రాంతం చేసుకోగలిగింది? జయించిన పిదప ఒక సంవత్సరం కాదు రెండు సంవత్సరాలు కాదు, 190 సంవత్సరాలపాటు తమ ఆధిపత్యాన్ని ఎలా నిలుపుకోగలిగారు? 1757 ప్లాసీ యుద్ధం మొదలు, 1947 వరకు ఇంత విశాలమైన దేశాన్ని ఎలా పాదాక్రాంతం చేసుకోగలిగారు? మనం ఎందుకు ఒకప్పుడు పరాధీనులమైనాం అనే విషయాన్ని సాకల్యంగా పరిశీలించి ఆయా దోషాలను సమూలంగా తొలగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. పరాక్రమంలోను, మానవశక్తిలోని, బుద్ధిబలంలోను, ప్రకృతి వనరులలోను, నాగరికతలోను ఏ దేశానికీ తీసిపోని భారతీయులు ఆంగ్లేయులకు, ఫ్రెంచ్‌వారికి, మొగలాయిలకు ఎలా పాదాక్రాంతులైనారు? దీనికొక ఆశ్చర్యకరమైన, విషాదకరమైన, ప్రత్యేకమైన కారణముంది.

ఇంగ్లీషువారి కంటె ముందు ఫ్రెంచ్ వారు దక్షిణ భారతంలో తమ రాజకీయాధిపత్యాన్ని కొంతకాలంపాటు స్థాపించుకున్నారు. 1746లో జరిగిన మొదటి కర్ణాటక యుద్ధంలో ఫ్రెంచ్‌వారు అఖండ విజయం సాధించారు. 1749లో జరిగిన రెండవ కర్ణాటక యుద్ధంలో కూడా వారు కొన్ని విజయాలు పొందగలిగారు. నైజాం నవాబు ఫ్రెంచ్‌వారి అనుయాయుడైనాడు. ఈ విజయాలకు కారణభూతుడు పుదుచ్చేరిలోని ఫ్రెంచ్ గవర్నర్ డూప్లే.

డూప్లే యొక్క జీవిత చరిత్రను రచించిన ఒక చరిత్రకారుడు అతని విజయానికి వెనుక గల రహస్యాన్ని ఇలా పేర్కొన్నాడు. "భారతదేశాన్ని భారతీయుల సహాయంతోనే జయించవచ్చునని కనిపెట్టిన మొదటి పాశ్చాత్యుడు డూప్లే." [Dupleix was the first European who discovered that India canbe conquered with the held of Indians]

డూప్లే కనిపెట్టిన సూత్రాన్ని మరింత సమర్థవంతంగా అమలుపరచి యావత్తు దేశాన్ని జయించినవారు ఆంగ్లేయులు. మీర్‌జాఫర్ ఇంగ్లీషువారితో లాలూచి అయినందువలననే క్లైవు బెంగాలును జయించగలిగాడు. అలాగే పీష్వా రఘునాథరావు ఆంగ్లేయులపక్షం చేరిన పిదపనే మహారాష్ట్ర రాజ్యం మీద ఆంగ్లేయుల ఆధిపత్యం మొదలైంది.

"ఎట్టి పరిస్థితులలోను నేను నా దేశానికి కీడు కలిగించను" అనే భావన ప్రతి పౌరునిలోను కలిగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

మా పిల్లలంతా పెద్దవాళ్లయి అక్కడా, ఇక్కడా చిన్న చిన్న ఉద్యోగాలలో ఉన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లు అయిపోయాయి.

వరమ్మగారి పరిస్థితి గురించి చెప్పాలంటే - కన్ను చెమరిస్తుంది. నిజానికి ఆమె గుండెల మీద జడివాన కురిసిందనే చెప్పవచ్చు.

రైతులు తాము సేద్యం చేస్తున్న పొలాల్ని తామే తీసేసుకుంటా మన్నారు. బేరసారాల మాట వచ్చేసరికి పాత బాకీలన్నీ గాలి క్కొట్టుకుపోయినై. వారు ఇస్తామన్న సొమ్ముకి నే నేవో అంకెలు చెప్పబోతే, వరమ్మగారు ఒక ఉదాసీనపు నవ్వు నవ్వి వదిలేసింది.

వచ్చిన డబ్బుతో సరోజమ్మగారి పిల్లల పెళ్లిళ్లు పూర్తి చేశారు.

పాత దాయాది వరంధామయ్య వచ్చి, నోటీసులూ, వకీళ్లూ అని మొదలెడితే - నిబ్బరంగా, నిదానంగా "మీ క్కావల్సింది ఈ ఇంట్లో నగ భాగమేగా. తీసుకోండి! అమ్ముకున్నా అర్పుకున్నా మీ ఇష్టం. న్యాయం మీకు తెలును. చట్టం మనిద్దరికీ తెలియకబోవచ్చు. నేను ధర్మం మీద పోతాను" అన్నది. ఎంత వేదాంతాన్ని ఆమె బుర్రకెక్కించుకున్నదో మరి!

ఇల్లు రెండుగా చీలింది. పెరడు ప్రహరీ నుంచి ముంగిలి ప్రహరీదాకా. ఇదిగో ఇవతలి సగంలోనే మా షాపులు ఏర్పాటు చేసుకున్నది. అదీ ఆమె చలవే! "మీ ఇద్దరూ ఏది బాగుంటుం దనుకుంటారో అట్లా చేసుకోండి!" అంది.

సరోజ కూడా తల్లి మాటలకు తల ఊపింది. ఆమె చిన్నప్పటి నుంచీ అలవరచుకున్న స్వభావానికి ఇ దేమీ విరుద్ధం కాదని మాకు తెలును.

ఇదంతా ఇట్టా ఉంచి, సరిగ్గా ఇవ్వాళ జరిగింది చెప్తాను.

సంపూర్ణ, ఆమె భర్త శేఖరం వచ్చారు ఢిల్లీ నుంచి. అతను అక్కడే సెంట్రల్ సెక్రటేరియట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

మురళి, అతని భార్య రమణి కూడా ఇంట్లోనే ఉన్నారు. మురళికి పక్క టౌన్లో ఏదో ఎరువుల కంపెనీలో ఉద్యోగం.

ఖాశింనీ, నన్నూ పిలిపించారు. శారదా, ఖాజాబాబాయ్ కూడా వచ్చారు.

మధ్యాహ్నం రెండే గంటలు దాటింది.

సంపూర్ణ సరాసరి విషయం ప్రస్తావించింది.

"అన్నయ్య మమ్మల్ని రమ్మని రాశాడు. అంతా ఆలోచించి మే మో నిర్ణయాని కొచ్చాం. ఇల్లుని పూర్తిగా డిస్పోజ్ చేసేయాలని మా ఉద్దేశ్యం. ఆ తతంగమంతా అయింది. వచ్చే సోమవారం రిజిస్ట్రేషన్. ఇక వారం రోజులుంది. మురళి టౌన్లోనే ఉంటాడుట. అమ్మమ్మ వాడి దగ్గర ఉంటుంది. అమ్మని నేను తీసుకుపోతాను. మీ రిద్దరూ - షాపులూ, మీ ఇళ్ల అద్దె విషయం కొత్త యజమానితో మాట్లాడుకోవాల్సి ఉంటుంది!" - ఈ చివరి మాటల్ని నన్నూ ఖాశింనీ ఉద్దేశించి చెప్పింది.

మేమంతా ఒకరి మొహా లొకరం చూసుకున్నాం. మా గుండెల్లో ముల్లు గుచ్చుకుంది. ఊపిరి బిగిసింది. అందరం కలిసి వరమ్మగారి కేసి చూశాం.

మాట పెగల్చుకుని అడిగింది ఆమె - "బేరం పెట్టింది ఎవరికిరా?" -

"వరంధామయ్య మామయ్యకి!' - మురళి జవాబు.

వరమ్మగారు మౌనం వహించింది. సరోజమ్మ అన్నది - "పోనీలే, పాపం! ఆయనే తీసుకుంటే మొత్తంగా అనుకూలంగా ఉంటుంది. మంచి పనే చేశారు."

ఠక్కున లోపలకి వెళ్లిపోయింది ఆమె. ఈ మాటలు పూర్తి చేస్తుంటే సరోజమ్మ గొంతు బొంగురు పోవడం మేము గమనించకపోలేదు.

మా పరిస్థితి అదోలా ఉంది. ఏం అనాలో, ఏమి అనకూడదో తెలియడంలేదు. నేను లేచి నిలబడ్డాను. నా వెనుక ఖాశిం లేచాడు. మళ్లీ అంతలోనే ఇద్దరమూ కూర్చున్నాం. శారదా, ఖాజాబాయ్ కళ్లు తుడుచుకుంటున్నారు. వాళ్ల కేమీ మాటలు విడివడటంలేదు.

వరమ్మగారు తాపీగా, నిబ్బరంగా అన్నారు - "రిజిస్టరీ తేదీ ఇంకా ఉందిగా. ఇంత ముందుగా చెప్పఖర్లేదులేరా! ఇల్లు ఖాళీ చేసి బయటకు నడవమన్నా మీ అమ్మా, నేనూ ఏమీ అభ్యంతరం చెప్పమని తెలునుగా, సంపూర్ణా! అట్టాగే కానియ్యండి!"

ఆ తర్వాత వాతావరణం గంభీరంగా మారింది. మరో పావుగంటకి ఎటువాళ్లు అటు వెళ్లిపోయారు. నేనూ నిమ్మళంగా కదిలాను.

** ** **

మర్నాడు రాత్రి -

శారదనీ, ఖాజాబాయ్‌నీ పిలిపించారు వరమ్మగారు. వరమ్మగారికీ, సరోజమ్మగారికీ రాకూడని కష్టం వచ్చిందని నిజంగానే వాళ్ల ముందు బావురు మన్నారట వా ళ్లిద్దరూ.

పెదవుల మీద వీడని వెలుగుతో, ముఖాన తొలగని కాంతితో, నిండు మనసుతో అన్నదిట - "పిచ్చి పిల్లల్లారా! ఏదో ఓ రోజు ఇలా జరుగుతుందని నాకు తెలుసు. అందుకే ఇదిగో మీ డబ్బు మీకు భద్రపరుస్తూ వచ్చాను. రామ్మూర్తీ ఖాశిం చేసిన పనికిగానీ, మీ ఇద్దరి శ్రమకీ, ఆప్యాయతకీ గానీ విలువ కట్టడం కాదు గానీ, నా శక్తి కొద్దీ ఈ మాత్రం మిగిల్చాను. తీసుకోండి!" అని నోట్ల కట్టని చేతుల్లో పెట్టిందట. "వచ్చినంతలో ఓ చిన్న గూడుని సమకూర్చుకోండి!" అని ఇద్దరినీ విడివిడిగా అక్కున చేర్చుకుందిట.

అరచేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా కళ్లనీళ్లు పెట్టుకుందిట సరోజమ్మ.

ఈ విషయం చెప్పి వెక్కివడసాగింది శారద.

ఆవేళ మధ్యాహ్నం వరమ్మగారు తన బ్యాంక్ అకౌంట్‌ని రద్దు చేయించి నా చేత డబ్బు తెప్పించుకున్నది ఇందుకన్నమాట!

ఆరుబయట ఆలోచిస్తూ పడుకున్నాను.

వాస్తవం నుంచి కలలోకి జారుకుంటున్నానో, ఒక మహా స్వప్నం నుంచీ వాస్తవంలోకి తేరుకుంటున్నానో క్షణకాలం అర్థం కాలేదు నాకు.

సముద్రం ఒడ్డున గులకరాయిలా నిలబడిపోయాను. తలెత్తి ఆకాశం కేసి చూశాను. కన్నీటి పొర అడ్డుకుంది. శుక్ర తార మసక మసగ్గా కనిపించింది! గుండె అంతా చిత్రమైన భావంతో నిండిపోయింది - ఏదో పోగొట్టుకున్నట్లు, ఎన్నడో దొరక్కపో దన్నట్లు!

** ** **

ఈ కథంతా విని, "నేను నమ్మను. వరమ్మగారూ, సరోజమ్మగారూ - ఇవాళా రేపూ ఎక్కడా కనపడరు" అన్నాడు మా మనవడు.

నేను నవ్వుగా సవ్వాను - "మరి ఇతరుల సంగతి?" అడిగాను.

"నువ్వే చెప్పు" అన్నాడు.

"నేనేరా ఆ కథలో రామ్మూర్తిని!" అన్నాను.

వాడు నా వైపు తేరిపార చూస్తున్నాడు.

"ఆ తర్వాత సరోజమ్మా, వరమ్మగారూ ఎలా ఉన్నారో మళ్లీ చెప్తాను" అని లేచాను.

★



## మన్‌మోహన్‌గారికో ఉచిత సలహా

నిధులు పెంచుకోడానికి ఏ టాక్స్ పెంచాలా, ఎవరిని ముక్కుపిండాలా, ప్రజా ప్రతినిధులకు సౌకర్యాలు ఎలా పెంచాలా? అని నిత్యం మల్లగుల్లాలు పడుతున్న మన్‌మోహన్‌గారికి మీ రిచ్చే సలహా చెప్పమని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'వా రడిగితే, న్యూఢిల్లీ వాసి ఎస్.ఎస్. సక్సేనా చాలా అభిమానంతో ఓ సలహా ఇచ్చారు. చిత్తగించండి.

"చపాతీ ధరను పది రూపాయలుగా నిర్ణయించి లగ్జరీ టాక్స్ విధించేయండి. ఆ వసూళ్లతో హేప్పీగా ప్రతి ఎం.పీ.కి సొంత విమానంలాంటి అత్యవసరమైన వాటిని సమకూర్చిపెట్టాలి. ఇంకా ప్రతియేటా తమతమ భాజా భజంత్రీల ,నెత్తిన వరాల మూటలను గుమ్మరించడానికీగానూ, వారి వారి అనుయాయుల నుంచి రక్షణకు ఎస్.పి.జి. [స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్] ఆఫీసర్లు ఒక వేయిమందిని నియమించుకోవడానికిగాను ప్రతివారికీ పది లక్షలు కేటాయించేసేయాలి."

. ఎలా ఉందీ అయిడియా!